# 15 అధ్యాయము

### ద్రాక్షవల్లి – తీగలు

“నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. 2 నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసి
పారవేయును ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును. 3 నేను
మీతో చెప్పిన మాటనుబట్టి మీరిప్పుడు పవిత్రులైయున్నారు. 4 నాయందు నిలిచియుండుడి మీయందు నేనును
నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనే గాని తనంతట తానే ఏలాగు ఫలింపదో, ఆలాగే నాయందు
నిలిచియుంటెనేకాని మీరును ఫలింపరు. 5 ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో, నేను
ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. 6 ఎవడైనను
నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగె వలె బయట పారవేయబడి యెండిపోవును మనుష్యులు అట్టి వాటిని
పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును. 7 నాయందు మీరును మీయందు నా మాటలును
నిలిచియుండినయెడల మీకేది ఇష్టమో అడుగుడి అది మీకు అనుగ్రహింపబడును. 8 మీరు బహుగా ఫలించుటవలన నా
తండ్రి మహిమపరచబడును ఇందువలన మీరు నా శిష్యులగుదురు. 9 తండ్రి నన్ను ఏలాగు ప్రేమించెనో నేనును
మిమ్మును ఆలాగు ప్రేమించితిని నా ప్రేమయందు నిలిచియుండుడి 10 నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన
ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలు గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచియుందురు. 11
మీయందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెననియు, ఈ సంగతులు మీతో
చెప్పుచున్నాను.

### ఒకరినొకరు ప్రేమించుట

12 నేను మిమ్మును ప్రేమించినప్రకారము, మీరొకని నొకడు ప్రేమించ వలెననుటయే నా ఆజ్ఞ. 13
తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు. 14 నేను మీ
కాజ్ఞాపించువాటిని చేసిన యెడల, మీరు నా స్నేహితులై యుందురు. 15 దాసుడు తన యజమానుడు చేయు
దానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను, ఎందుకనగా, నేను
నా తండ్రివలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని. 16 మీరు నన్ను ఏర్పరచుకొనలేదు మీరు నా
పేరట తండ్రిని ఏమి అడుగుదురో అది ఆయన మీకనుగ్రహించునట్లు మీరు వెళ్లి ఫలించుటకును, మీ ఫలము
నిలిచియుండుటకును, నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని. 17 మీరు ఒకనినొకడు
ప్రేమింపవలెనని ఈ సంగతులను మీకు ఆజ్ఞాపించుచున్నాను.

### లోకము – సత్య స్వరూపి

18 లోకము మిమ్మును ద్వేషించినయెడల మీకంటె ముందుగా నన్ను ద్వేషించెనని మీరెరుగుదురు.
19 మీరు లోకసంబంధులైన యెడల లోకము తన వారిని స్నేహించును అయితే మీరు లోకసంబంధులు
కారు నేను మిమ్మును లోకములోనుండి ఏర్పరచుకొంటిని అందుచేతనే లోకము మిమ్మును ద్వేషించుచున్నది.
20 దాసుడు తన యజమానుని కంటె గొప్పవాడు కాడని నేను మీతో చెప్పినమాట జ్ఞాపకము చేసికొనుడి
లోకులు నన్ను హింసించినయెడల మిమ్మును కూడ హింసింతురు నా మాట గైకొనినయెడల మీ మాట కూడ
గైకొందురు. 21 అయితే వారు నన్ను పంపిన వానిని ఎరుగరు గనుక నా నామము నిమిత్తము వీటన్నిటిని
మీకు చేయుదురు. 22 నేను వచ్చి వారికి బోధింపక యుండినయెడల, వారికి పాపము లేకపోవును ఇప్పుడైతే
వారి పాపమునకు మిషలేదు. 23 నన్ను ద్వేషించువాడు నా తండ్రిని కూడ ద్వేషించుచున్నాడు. 24 ఎవడును

చేయని క్రియలు నేను వారి మధ్య చేయకుండినయెడల వారికి పాపము లేకపోవును ఇప్పుడైతే వారు నన్నును
నా తండ్రిని చూచి ద్వేషించియున్నారు. 25 అయితే – నన్ను నిర్హేతుకముగా ద్వేషించిరి అని వారి
ధర్మశాస్త్రములో వ్రాయబడిన వాక్యము నెరవేరునట్లు ఈలాగు జరిగెను. 26 తండ్రియొద్దనుండి మీ యొద్దకు
నేను పంపబోవు ఆదరణకర్త అనగా తండ్రియొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు
ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును. 27 మీరు మొదటనుండి నా యొద్ద ఉన్నవారు గనుక మీరును
సాక్ష్యమిత్తురు.”